నమస్తే తెలంగాణ

సంగారెడ్డి

I | హైదరాబాద్, గురువారం 22 ఆగస్టు 2024 | SANGAREDDY




సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం ఆరేపల్లిలో రుణమాఫీ కాలేదని ఆందోళన చెందుతున్న రైతులు

# అరిగోస పడుతున్న ఆరేపల్లి రైతులు

- గ్రామంలో 30 మంది రైతులకు మాఫీకాని రుణం
- బ్యాంకు, వ్యవసాయ కార్యాలయం చుట్టూ రైతుల చక్కర్లు
- అధికారులు స్పష్టత ఇవ్వడం లేదని గ్రామస్తుల ఆవేదన
- కాంగ్రెస్ సర్కారుపై అన్నదాతల ఆగ్రహం

దుబ్బాక, ఆగస్టు 21: రైతులందరికీ రుణమాఫీ చేశామంటూ కాంగ్రెస్ సర్కారు గొప్పలు చెప్పుకుంటున్నది. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం ఆరేపల్లిలో చాలామంది రైతులకు రుణమాఫీ వర్తించక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఆరేపల్లిలో 120 వరకు రైతు కుటుంబాలు ఉన్నాయి. వంద కుటుంబాలు రైతులు బ్యాంకులో పంట రుణాలు తీసుకున్నాయి. ఇందులో తొలి విడతలో 25 మంది రైతులకు , 2వ విడతలో 20 మందికి , 3వ విడతలో 22 మందికి రుణమాఫీ అయ్యింది.గ్రామంలో మరో 30 మంది రైతులకు రుణమాఫీ కాలేదు. దీనిపై అధికారుల నుంచి స్పష్టత లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం బ్యాంకుల చుట్టూ, వ్యవసాయ కార్యాలయం వద్దకు తిరుగుతూ అరిగోస పడుతున్నారు. అందరి రు ణాలు మాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



## అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు..

నేను తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు బ్రాంచ్‌లో రూ.1.60 లక్షలు రుణం తీసుకున్నా. నాభార్య పేరిట రూ.1.30 లక్షల రుణం తీసుకున్నం. పంటరుణమాఫీ కాలేదని బ్యాంకు అధికారులు చెప్పారు. ఈ విషయంపై వ్యవసాయాధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. నిత్యం బ్యాంకు, వ్యవసాయ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం. మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. - తొట్ల రాజయ్య, రైతు ఆరేపల్లి

## నాపేరిట రెండు రుణాలు ఉన్నాయట



గ్రామీణ బ్యాంకులో నా పేరిట రూ. 50 వేల చొప్పున రెండు రుణాలు ఉన్నాయని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. రైతుకు ఒక్కటే రుణం ఉంటుంది. కానీ, ఒకే బ్యాంకులో నా పేరిట రెండు రుణాలు ఉన్నాయని అధికారులు చెప్పడి విడ్డూరం. నాకు పైసా రుణమాఫీ కాలేదు. బ్యాంకుకు పోయి అడిగితే రుణమాఫీ కాలేదంటున్నారు. మాలాంటి రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు. - చెట్టి లక్ష్మీనారాయణ, రైతు, ఆరేపల్లి



## మాకు రుణమాఫీ కాదా..

మాకు 5 ఎకరాల భూమి ఉన్నది. భూమిని నమ్ముకునే బతుకుతున్నం. బోరుబావులు తవ్వించేందుకు బ్యాంకులో రుణం తీసుకున్నం. నా పేరిట రూ.1.20 లక్షలు, నా భర్త ఎల్లయ్య పేరిట రూ.లక్ష బ్యాంకులో అప్పు ఉన్నది. రైతులకు సర్కారు రుణమాఫీ చేసిందన్నారు. మా రుణమాఫీ కాలేదని బ్యాంకు సార్లు చెప్పారు. మా ఊరు నుంచి 8 కి.మీ దూరంలో ఉన్న దుబ్బాక గ్రామీణ బ్యాంకుకు రోజూ వెళ్లి వస్తున్నా. ఇప్పటికీ మూడు విడతల్లో మాపేర్లు రాలేవు. మాకేందుకు రుణమాఫీ కాలేదు..మేం రైతులం కాదా.. మా బాధ సర్కారుకు పట్టదా..?. - కాసర్ల బాలవ్వ, మహిళా రైతు, ఆరేపల్లి

## ఎదురు చూస్తున్నా..!



నాకు రెండెకరాల భూమి ఉన్నది. బ్యాంకులో రూ.70 వేలు రుణం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ ప్రకటించిందనగానే సంతోషపడ్డ. తొలి విడతలో నాపేరు రాలేదు. మళ్లీ రెండో విడతలో చూశాను. అందులో లేదు. ఇప్పుడు మూడో విడతలో కూడా రుణమాఫీ కాలేదు. మాలాంటి చిన్న రైతులకు రుణమాఫీ చేయలేని, ఇదేమి సర్కారో అర్థం కావడం లేదు. చెట్ల నర్సింహులు, రైతు, ఆరేపల్లి

# మాఫీ మంటలు

## ఉమ్మడి మెదక్ జిల్లాలో అన్నిచోట్ల కొనసాగుతున్న అన్నదాతల నిరసనలు

- గ్రీవెన్ సెల్‌కు వెల్లువలా దరఖాస్తులు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 11,328 అర్జీలు
- వ్యవసాయశాఖ అధికారుల బదిలీలతో గందరగోళం
- రెండు లక్షల పైన డబ్బులు కట్టడానికి వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు
- గడపగడపకూ బీఆర్ఎస్ శ్రేణులు
- పంటరుణమాఫీ కాని రైతుల వివరాల సేకరణ
- నేడు అన్ని మండల, నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు

సిద్దిపేట, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేస్తున్నది. పంట రుణమాఫీ విషయంలో ఒక స్పష్టత లేక రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. పంట రుణమాఫీ కాని రైతులు రోడ్డెక్కుతున్నారు. రోజు రోజుకూ నిరసనలు పెరుగుతున్నాయి. అర్హత ఉండి పంటరుణమాఫీ కాని రైతుల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించడం లేదు. జిల్లా, మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన గ్రీవెన్‌సెల్‌కు దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. సిద్దిపేట జిల్లాలో 3,142, మెదక్ జిల్లాలో 3,686 సంగారెడ్డి జిల్లాలో 4,500 మంది రైతులు, మొత్తంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో11,328 పైగా రైతులు గ్రీవెన్‌సెల్‌కు దరఖాస్తు చేసుకున్నారు.ఇది అధికార లెక్కలు మాత్రమే ..అంతకన్న ఎక్కువ మండల ఏఈవోల వద్ద దరఖాస్తులు ఉన్నాయి. వాటిని అన్నింటిని సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉన్నది. బుధవారం రెండో రోజూ సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లి ఇండియన్ బ్యాంకు వద్ద రైతులు ఆందోళనకు దిగారు. రెండు లక్షల పైన ఉన్న రైతులు మిగతా డబ్బులు కడితేనే పంటరుణమాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నది. మిగతా డబ్బులకు అప్పులు తెచ్చి కట్టాలా..? ఇప్పటికే రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి అధిక వడ్డీలకు తెచ్చి బ్యాంకుల్లో కడుతున్నారు. కట్టిన వాటికి పంటరుణమాఫీ ఎప్పుడు చేస్తారో..ప్రభుత్వం చెప్పడం లేదు. త్వరలోనే మండల నోడల్ అధికారులను నియమిస్తున్నట్లు వ్యవసాయశాఖ కమిషనర్ ప్రకటించారు. బీఆర్ఎస్ శ్రేణులు గడపగడపకూ వెళ్లి పంట రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరిస్తున్నారు. ఇక రైతులకు సంపూర్ణ రుణమాఫీ చేయాలని అన్ని మండల కేంద్రాల్లో నేడు (గురువారం) బీఆర్ఎస్ ఆధ్వర్యలంలో రైతలతో కలిసి ధర్నాలు చేపట్టనున్నారు. మండల తహసీల్దార్, నియోజకవర్గ కేంద్రాల్లోని ఆర్డీవో కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు.



బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ వద్ద బారులుతీరన రైతులు

### గ్రామాల్లో 50 శాతం కూడా రుణమాఫీ కాలేదు

రాష్ట్ర ప్రభుత్వం మూడు విడతలుగా పంట రుణమాఫీ చేసినట్లు చెబుతున్నది. ఇక్కడ చేసింది గోరంత..చెప్పేది కొండంత ..గ్రామాల్లో 50శాతానికి పైగా రైతులకు పంట రుణమాఫీ కాలేదు. మూడో విడతలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని ప్రభుత్వం చెబుతున్నది. మరో మెలికను ప్రభుత్వం పెట్టింది. రెండు లక్షలపైన ఎంత ఉన్నా దానిని రైతు బ్యాంకుకు చెల్లిస్తే రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెబుతున్నది. ఈ విషయంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చేయాలనుకున్న రెండు లక్షల పంటరుణమాఫీ రైతుల లోన్‌అకౌంట్‌లో జమ చేసి మిగతా డబ్బులు కట్టమంటే బాగుండు, కానీ, అలా ప్రభుత్వం చేయడం లేదని వారు వాపోతున్నారు. మరికొంత మంది రైతులు రెండు లక్షల పైన ఉన్న డబ్బులు కడితేనే పంటరుణమాఫీ అవుతుందేమోనని అధిక వడ్డీలకు తెచ్చి మిగతా డబ్బులను బ్యాంకుల్లో కడుతున్నారు. ఇలా కట్టిన తమకు రెండు లక్షల పంటరుణమాఫీ చేస్తారా..? లేదా..? అని రైతుల్లో సందేహం నెలకొన్నది. ఇదే విషయమై వ్యవసాయశాఖ అధికారులను అడిగితే వారు నాలుగైదు రోజుల్లో పూర్తి క్లారిటీ వస్తున్నది. అంతవరకు తాము ఏం చెప్పలేం అని సమాధానం ఇస్తున్నారు.

### పెద్ద సంఖ్యలో రైతుల నిరసనలు

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా రోజూ తమకు పంట రుణమాఫీ కాలేదని రైతులు రోడ్డెక్కుతున్నారు. పెద్ద సంఖ్యలో రైతులు తమ నిరసనలు తెలియజేస్తున్నారు. వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు సరిగ్గా లేకపోవడం. ఇతర షరతులతో ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు సంపూర్ణ పంటరుణమాఫీ చేయాల్సిందేనని పట్టుబడుతున్నారు. వ్యవసాయశాఖ మండల, జిల్లాల వారీగా ఏర్పాటు చేసిన గ్రీవెన్ సెల్‌కు వెల్లువలా దరఖాస్తులు వస్తున్నాయి. రెండు రోజులుగా గ్రామాల్లో ఏఈవో, ఏవోల వద్దకు రైతులు క్యూ కడుతున్నారు. ఇదే సమయంలో వ్యవసాయశాఖలో బదిలీలు జరుగుతుండడంతో కొన్నిచోట్ల కార్యాలయాల్లో అధికారులు ఉండడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటు రుణమాఫీ కాక, అటు కొత్త రుణాలు రాక ప్రైవేట్ వ్యాపారుల వద్దకు రైతులు పరుగులు తీస్తున్నారు.

### గడప గడపకూ బీఆర్ఎస్

సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులు గడపగడపకూ వెళ్తున్నాయి. బుధవారం నుంచి అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి గడపకూ వెళ్లి పంట రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరిస్తున్నారు. ఒక కుటుంబంలో ఎంతమంది రైతుల పేరిట పంట రుణాలు తీసుకున్నారు. ఎంతమంది రైతులకు పంట రుణమాఫీ జరిగింది. ఇంకా ఎంత మందికి కావాలి.. పంట రుణమాఫీకాక పోవడానికి గల కారణాలు, తదితర అంశాలపై సమగ్ర వివరాలు సేకరిస్తున్నారు.

### గ్రీవెన్ సెల్‌కు వచ్చిన దరఖాస్తులు

ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్ సెల్‌కు రైతుల నుంచి దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. ఇప్పటివరకు ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పంట రుణమాఫీ కోసం 11,328 రైతులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో సిద్దిపేట నుంచి 3,142, సంగారెడ్డి నుంచి 4,500, మెదక్ నుంచి 3,686 దరఖాస్తులు వచ్చాయి.

# తూతూమంత్రంగా మంత్రుల సమీక్ష

## ప్రజా సమస్యలు లేవనెత్తిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



సంగారెడ్డిలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, ఎంపీలు, కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్లు

సంగారెడ్డి, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ): రైతులు ఎదుర్కొంటున్న పంట రుణమాఫీ సమస్యలపై బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కొండా సురేఖ నిర్వహించిన సమీక్షా సమావేశంలో లోతుగా చర్చించలేదు. రైతు రుణమాఫీ అమలులోని లోపాలు సరిదిద్దేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తారని రైతులు, రైతుసంఘాలు ఆశించినా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలు, జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్ ప్రజలు కాలుష్యం సమస్యపై ఆందోళన చేస్తున్నా సమావేశంలో కాలుష్యనివారణపై లోతుగా చర్చించలేదు.

### ప్రజా సమస్యలు లేవనెత్తిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, కోనింటి మాణిక్‌రావు తమ నియోజకవర్గాల సమస్యలను లేవనెత్తి పరిష్కరించాల్సిందిగా మంత్రులను కోరారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలు చేపట్టాలని కోరారు. రైతులందరికీ పంటరుణమాఫీ వర్తింప చేయాలన్నారు. ఆర్‌ఆర్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న పెద్దాపూర్, గిర్మాపూర్‌తోపాటు ఇతర ప్రాంతాల రైతులకు భూమికి బదులు అంతే విలువ చేసే భూమి ఇవ్వాలని కోరారు. సంగారెడ్డి నియోజకజవర్గంలోని రహదారుల పనుల కోసం ఎంఆర్‌ఆర్‌లో మంజూరైన రూ.10.40 కోట్ల పనులు చేపట్టాలని, ఎస్‌డీఎఫ్, సీఎం ప్రత్యేక నిధులతో మంజూరైన రూ.29.33 కోట్ల పనులు చేపట్టాలని కోరారు. కంది, సదాశివపేట ఎంపీపీ కార్యాలయ భవనాల నిర్మాణానికి నిధులు ఇవ్వాలని, మినీ హాజ్‌హౌస్ నిర్మాణానికి రూ.2.5 కోట్లు ఇవ్వాలని కోరారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు మా ట్లాడుతూ పిరమిల్, గిరిధర్ పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యం నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. మంజీరానదిలోకి కాలుష్యం జలాలు వదులుతున్నారని, దీనికి అడ్డుకట్టవేయాలని కోరారు. న్యాల్‌కల్‌లో ఫార్మా విలేజ్ నిర్మాణం కోసం 2వేల ఎకరాల భూసేకరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఝరాసంగం ఆలయానికి వెళ్లే రహదారి నిర్మాణానికి రూ.5 కోట్లు, నియోజకవర్గంలో రహదారుల పనులకు రూ.7.20 కోట్లు ఇవ్వాలని కోరారు.

# మేజర్ గ్రామాల్లో సబ్‌పీహెచ్‌సీలు, ఓపెన్ జిమ్‌లు

## రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్



కోహెడ: సబ్‌సెంటర్‌లో మాత్రలను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం

కోహెడ ఆగస్టు 21: మేజర్ గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తామని రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని బస్వాపూర్‌లో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి, జిల్లా వైద్యాధికారితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యమన్నారు. అనంతరం దవాఖానలో ఉన్న మందులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేఖ, వైద్యాధికారి నిమ్రా, నాయకులు మంద ధర్మయ్య, శెట్టి సుధాకర్, ముంజ తిరుపతి, గొరిట్యాల లక్ష్మణ్, భీంరెడ్డి తిరుపతిరెడ్డి, కర్ర రవీందర్ పాల్గొన్నారు.

# మాకెందుకు రుణమాఫీ కాలేదు!

## సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం హద్నూర్ కెనరా బ్యాంకు వద్ద రైతుల ఆవేదన



బుధవారం హద్నూర్‌లోని కెనరా బ్యాంకులో ఇబ్బందులు పడుతున్న రైతులు

న్యాల్‌కల్, ఆగస్టు 21: రైతులందరికీ రూ.2 లక్షల్లోపు పంట రుణాలు మాఫీ చేస్తామన్న కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత కొర్రీలతో సగం మంది రైతులకు రక్త 'హస్తం' చూపిస్తున్నది. ఏ గ్రామానికి వెళ్లినా.. ఏ రైతును పలకరించినా పంట రుణమాఫీ కాలేదన్న ఆవేదనే వినిపిస్తున్నది. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం హద్నూర్ కెనరా బ్యాంకు పరిధిలో రుక్మాపూర్, ముంగి, మిర్జాపూర్(ఎన్), తాట్‌పల్లి, టేకూర్, గుం జోట్టి, రాంతీర్థం, మల్కన్‌పాడ్, హద్నూర్‌తో పాటు ఝరాసంగం మండలం ఎల్గోయి గ్రామాల రైతులు ఉన్నారు. ఆయా గ్రామాల పరిధిలో రూ.లక్షలోపు నుంచి రూ. రెండు లక్షలకు పైగా పంట రుణాలు తీసుకున్న రైతులు 2,000 మంది ఉన్నారు. వీరికి రూ.22 కోట్ల వరకు పంట రుణమాఫీ కావాల్సి ఉన్నది. అయితే ప్రస్తుతం పంట రుణమాఫీ అయిన రైతులు 746 మంది ఉండగా వారికి రూ.8.40 కోట్ల మేరకు పంటరుణమాఫీ జరిగింది. ఇంకా పంటరుణమాఫీ జరగాల్సిన రైతులు 1,254 మంది ఉన్నారు. వారికి రూ.13.60 కోట్లు మాఫీ కావాల్సి ఉన్నది. వీరందరికీ వివిధ కారణాలు చూపుతూ పంట రుణమాఫీ చేయలేదు.ప్రభుత్వ ఆదేశాల మేరకు పంట రుణమాఫీ కాని రైతులందరూ దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారులు సూచించడంతో రైతులు బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాలు, రైతు వేదిక వద్ద బారులు తీరుతున్నారు.

### షరతులు లేకుండా మాఫీ చేయాలి



షరతులు లేకుండా పంట రుణమాఫీ చేయాలి. రూ.లక్ష నుంచి రూ.2లక్షలలోపు పంట రుణాలు తీసుకుని అర్హత ఉన్న రైతులకు రుణమాఫీ కాలేదు. ఇప్పటివరకు రైతు భరోసా లేక, పంట రుణమాఫీ కాక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. రైతులు బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పంట రుణమాఫీ కాకపోవడానికి ప్రభుత్వం విధిస్తున్న షరతులు, సాంకేతిక సమస్యలతో రైతులకు చుక్కలు చూపిస్తున్నారు. ఇచ్చినమాట ప్రకారం ఎలాంటి నిబంధనలు లేకుండా అర్హత ఉన్న రైతులందరికీ పంట రుణమాఫీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

–ఎంఆర్.ప్రవీణ్‌కుమార్, పీఏసీఎస్, డెరెక్టర్, బీఆర్ఎస్ నేత, హద్నూర్



సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ, పక్కన ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు

# సంక్షేమ ఫలాలు అందరికీ అందాలి

## మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 21: సంక్షేమ ఫలాలు అందరికీ అందాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆరు గ్యారెంటీల అమలు, వివిధ శాఖల పనితీరుపై అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన కొన్ని రోజుల్లోనే పార్లమెంట్ ఎన్నికలు వచ్చినందున అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో కొంత జాప్యం జరిగిన విషయం నిజమేనన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలు, విద్యా, వైద్యం, సీజనల్ వ్యాధులు, తాగునీరు, రుణమాఫీ, నూతన రుణాల పంపిణీ, చేనేత కార్మికుల సమస్యలు, గృహజ్యోతి పథకం, ఆర్టీసీ, విద్యాశాఖ, మున్సిపల్, ఎక్సైజ్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, దేవాదాయశాఖ వనమహోత్సవ్, నిమ్జ్ భూసేకరణపైశాఖల వారీగా సమీక్షించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ దేవాదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా సంరక్షించాలని సూచించారు. అంతకుముందు కలెక్టరేట్‌లో ఇందిరా మహిళా శక్తి పథకాన్ని మంత్రులు ప్రారంభించారు. కలెక్టరేట్ క్యాంటీన్‌ను మంత్రులు ప్రారంభించారు. లబ్ధిదారులకు ఇందిరా మహిళాశక్తి రుణాలకు సంబంధించిన చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మాలాజగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎంపీలు రఘునందన్‌రావు, సురేశ్‌షెట్కార్, ఎస్పీ రూపేశ్, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, సంజీవరెడ్డి, డీసీసీబీ అధ్యక్షుడు చిట్టి దేవేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రుణమాఫీ అమలులో కాంగ్రెస్ విఫలం

## బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి



సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఆగస్టు 21: రైతులకు ఏకకాలంలో రెండు లక్షల పంట రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయా మండలాలకు చెందిన నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశం అనంతరం ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు వంద శాతం పంట రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్‌లో గురువారం ఉదయం రైతులతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే ర్యాలీకి ఆయా గ్రామాల నుంచి రుణమాఫీ కాని రైతులు, నాయకులు, యువకులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నేటికీ 60శాతం మంది రైతులకు పంట రుణమాఫీ కాలేదని రోజూ బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా వారు నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారన్నారు. రైతుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం సవాలక్ష ఆంక్షలు పెట్టి అనేక రకాలుగా ఇబ్బంది పెడుతున్నదన్నారు. రైతులు రోడ్డెక్కి గగ్గోలు పెడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, ప్రభుత్వానికి రైతుల ఉసురు తగులుతుందన్నారు. విడతల వారీగా చేపడుతామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి పంట రుణమాఫీ చేయడంలో విఫలమయ్యారని, వెంటనే రాజీనామా చేయాలన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రెండు లక్షల పంటరుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర యువజన విభాగం నాయకుడు జుబేర్‌పాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయోద్దీన్, మాజీ ఎంపీపీ పాండు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, కుమార్‌యాదవ్, నాయకులు అమరేందర్, కిరణ్‌గౌడ్, స్వామిచారి, అహ్మద్, రవిరెడ్డి, కరీం, స్వామి పాల్గొన్నారు.


## నేడు పంటరుణమాఫీపై

# బీఆర్ఎస్ ధర్నాలు

సంగారెడ్డి, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ): పంటరుణమాఫీ అమలులో కాంగ్రెస్ తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ గురువారం సంగారెడ్డి జిల్లా అంతటా ధర్నాలు నిర్వహించనున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష నుంచి రెండు లక్షల వరకు రైతులకు పంట రుణమాఫీ చేస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. ప్రభుత్వం రైతులందరికీ వందశాతం పంట రుణమాఫీ అమలు చేయలేదు. దీంతో రైతులు ఆందోళన చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో మూడు విడతల్లో 97 566 మంది రైతులకు రూ.842.40 కోట్ల పంట రుణాలు మాఫీ చేసింది. జిల్లాలో అర్హులైన రైతులందరికీ పంట రుణమాఫీ కాలేదు. దీంతో రైతులు పంట రుణమాఫీ చేయాలంటూ ఆందోళనకు దిగుతున్నారు. పంట రుణమాఫీ కాని రైతులు అధికారులను కలిసి ఫిర్యాదులు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు పంట రుణమాఫీ కాలేదంటూ ఐదు వేల మందికిపైగా రైతులు ఫిర్యాదులు చేశారు. వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నవారి సంఖ్యరోజురోజుకు పెరుగుతూనే ఉన్నది. ఈ నేపథ్యంలో రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ జిల్లా అంతటా ధర్నా నిర్వహించనున్నది. సంగారెడ్డి, జహీరాబాద్, అందోలు, నారాయణఖేడ్, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో ఆర్డీవో, తహసీల్ కార్యాలయాల ఎదుట బీఆర్ఎస్ ధర్నా నిర్వహించనున్నది. ధర్నాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులు పాల్గొననున్నారు. ధర్నాలు విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ బీఆర్ఎస్ నాయకులను కోరారు.

# రెండో రోజూ రైతుల ధర్నా

బెజ్జంకి, ఆగస్టు 21: సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని తోటపల్లి ఇండియన్ బ్యాంకు వద్ద బుధవారం రెండో రోజూ పంట రుణమాఫీ కాని రైతులు ధర్నా చేశారు. బ్యాంకు పరిధిలో 1407 మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. మొదటి విడతలో ముగ్గురు రైతులకు రూ.1.26 లక్షలు మాఫీ కాగా రెండో విడతలో 294 మంది రైతులకు రూ.212 లక్షలు, మూడో విడతలో 117 మంది రైతులకు రూ.171 లక్షల పంట రుణమాఫీ జరిగింది. బ్యాంకు పరిధిలో 1407 మంది రైతులు ఉన్నా బ్యాంకు సిబ్బంది కొంత మంది రైతుల పేర్లు పంపడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బ్యాంకు సేవలను ముందుకు సాగనివ్వడం లేదు. రైతుల నిరసన విషయం తెలుసుకున్న ఏఎస్సై శంకర్‌రావు, పోలీసు సిబ్బందితో వచ్చి రైతులతో మాట్లాడారు. 993 మంది రైతుల్లో 800 మంది రైతులకు కొద్ది రోజుల్లో రుణమాఫీ డబ్బులు పడతాయని మంగళవారం జరిగిన బ్యాంకర్ల సమావేశంలో స్పష్టత వచ్చినట్లు బ్యాంకు మేనేజర్ అమిత్‌కుమార్ తెలిపారు. 197 మంది రైతుల్లో కొంతమందికి రూ.2 లక్షలకు పైగా రుణం ఉన్నదని, మరికొంత మందికి సాంకేతిక సమస్య ఉన్నదని, వీటిని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. ఏఎస్సై చొరవతో బ్యాంకు సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి.



బెజ్జంకి: తోటపల్లి ఇండియన్ బ్యాంకు వద్ద రైతులతో మాట్లాడుతున్న ఏఎస్సై



బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట కూర్చున్న మహిళా రైతులు